కల్పవల్లి..నల్లపోచమ్మ తల్లి

- గోల్కొండ కోట నుంచి అమ్మవార్లకు ప్రతి యేట పట్టు వస్త్రాలు
- 58 బస్తీల తొట్టెలు ఇక్కడ నిమజ్జనం
- బోనాలకు సిద్ధమవుతున్న సంజయనగర్‌లోని ఉమ్మడి ఆలయాలు


సంజయనగర్ నల్లపోచమ్మ


తుల్జాభవాని


జియాగూడ సంజయనగర్ నల్లపోచమ్మ, తుల్జాభవాని ఉమ్మడి ఆలయాలు

జియాగూడ: జియాగూడ ఇలవేల్పుగా పేరుగాంచిన సంజయనగర్ నల్లపోచమ్మ, తుల్జాభవాని ఉమ్మడి ఆలయాలు బోనాల వేడుకలకు సిద్ధమవుతున్నాయి. పాడి పంటలతో విరాజిల్లిన జియాగూడలోనిస్వయంభుగా వెలిసిన సంజయనగర్ నల్లపోచమ్మ మాతేశ్వరీ కోరికలు తీర్చే కల్పవల్లిగా పేరు గాంచింది. సుమారు 58 బస్తీలలోని కుటుంబాలు ఎలాంటి శుభకార్యం నిర్వహించినా ముందుగా నల్లపోచమ్మ తల్లిని దర్శించి నిర్వహించే కార్యక్రమం విజయవంతం అవుతుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ప్రస్తుతం రావుల కుటుంబానికి చెందిన 3వ వంశస్థులు ఆలయ ధర్మకర్తలుగా ఉంటూ ఆలయ దినదినాభివృద్ధికి కృషి చేస్తూ ఎన్నో కార్యక్రమాలను వైభవోపేతంగా నిర్వహిస్తున్నారు. ప్రతి యేటా ఆషాఢ మాసం, బోనాల వేడుకలు, దేవీ శరన్నవరాత్రి వేడుకలు, ప్రతినెలా అమావాస్య, పౌర్ణమి పూజలు, మహా అన్నదానం, సామూహిక వరలక్ష్మి వ్రతాలు, అయ్యప్పస్వామి మహా పడిపూజ, వార్షికోత్సవ మహోత్సవాలు తదితర ఎన్నో కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రతినిధి రావుల శ్రీనివాస్ తెలిపారు.

చరిత్రాత్మకమైన ఆలయం..

సంజయనగర్‌లో వెలసిన నల్లపోచమ్మ తల్లి సుమారు 250 ఏళ్ల క్రితం పాడిపంటలతో విరాజిల్లింది. సంజయనగర్ పొలాల్లో రైతు దున్నుతున్న తరుణంలో స్వయంభుగా మాతేశ్వరీ వెలిసింది. అప్పట్లో చిన్న ఆలయం నిర్మించారు. అప్పటి నుంచి పూజలందుకుంటుంది. ఇది ఇలా ఉండగా పెరుగుతున్న భక్తుల తాకిడిని దృష్టిలో పెట్టుకుని ఆలయాన్ని 12 ఏళ్ల క్రితం పునర్ నిర్మించి ఇందులోనే తుల్జాభవాన్ని దుర్గాదేవి, నాగదేవత, 11 వృక్షాలు, గోశాలను కూడా నిర్మించి పూజలు నిర్వహిస్తున్నారు.

అమ్మవార్లకు పట్టు వస్త్రాల సమర్పణ..

యేటా భారీ ఎత్తున జరిగే ఆషాఢ మాసం బోనాల వేడుకలకు గోల్కొండ కోట జగదాంబిక ఆలయం నుంచి పట్టు వస్త్రాలను అందజేస్తారు. అలాగే ఈనెల 28న అమ్మవార్లకు బోనాల సమర్పణ, మాతేశ్వరీలకు ప్రత్యేక అలంకరణ, హోమం, అఖండ హారతి, మహాప్రసాద వితరణ, కొత్తజంటల బోనాల సమర్పణ తదితర కార్యక్రమాలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ ప్రతినిధులు తెలిపారు. ఆదివారం రోజు సాయంత్రం సుమారు 58 బస్తీలకు చెందిన తొట్టెలను ఊరేగింపుగా తీసుకువచ్చి ఆలయంలో నిమజ్జనం చేయడంతో బోనాల వేడుకలు ముగుస్తాయి.

26న గృహకల్ప భవన సముదాయంలో బోనాలు


మాట్లాడుతున్న గడ్డం జ్ఞానేశ్వర్, కొండూరు గంగాధర్

నాంపల్లి: ఈనెల 26న గృహకల్ప భవన సముదాయంలో బోనాలు నిర్వహిస్తున్నట్లు తెలంగాణ నాల్గవ తరగతి ఉద్యోగుల కేంద్ర సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు గడ్డం జ్ఞానేశ్వర్, కొండూరు గంగాధర్ పేర్కొన్నారు. సోమవారం నాంపల్లిలోని కేంద్ర సంఘం కార్యాలయంలో బోనాల వేడుకల వివరాలను వెల్లడించారు. ముఖ్యఅతిథులుగా టీఎన్జీఓ కేంద్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ఎస్.ఎం.హుస్సేన్, టీజీఓ అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు, సహాధ్యక్షుడు బి.శ్యామ్, తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ మాజీ సభ్యుడు కారం రవీందర్‌రెడ్డి, తెలంగాణ రాష్ట్ర డైరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ లోకా భూమారెడ్డి హాజరవుతారని తెలిపారు. అదేరోజు ఉదయం 10 గంటలకు తెలంగాణ నాల్గవ తరగతి ఉద్యోగుల రాష్ట్ర స్థాయి కార్యవర్గ సమావేశం ఉంటుందని, 33 జిల్లాలకు చెందిన అధ్యక్ష, కార్యదర్శులు హాజరవుతారని తెలిపారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి


చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: తెలంగాణ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. సోమవారం ఆయన హకీంపేట్ ఎస్ఎస్ ఫంక్షన్‌హాల్‌లో 76 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల కారణంగా గత సంవత్సర కాలంగా సీఎంఆర్ఎఫ్ దరఖాస్తులు ఎన్నో పెండింగ్‌లో ఉండిపోయాయన్నారు. గత సంవత్సరం దరఖాస్తు చేసుకున్న వారికి చెక్కులు మంజూరయ్యాయని ఆయన తెలిపారు. కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, హారూన్‌ఫరాన్, అబీబ్‌చౌస్ తదితరులున్నారు.

ఘనంగా 58వ గోపాల్ కాలా మహోత్సవం

జియాగూడ: బవసార్ క్షత్రీయ చారిటబుల్ ట్రస్ట్ జియాగూడ ఆధ్వర్యంలో విఠల్ రుక్మాయి ఆలయంలో 58వ గోపాల్ కాలా మహోత్సవం ఘనంగా నిర్వహించినట్లు అధ్యక్షుడు డాక్టర్ ప్రశాంత్ నీమ్‌కర్ అన్నారు. హవన్ పూజ, శోభాయాత్ర, దహిఅండి, మధ్యాహ్నం మహాప్రసాద వితరణ, సాయంత్రం అఖండ హారతి నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంజయ్ ఘనాటే, గోరక్ష ప్రధాన కార్యదర్శి రమేష్, బవసార్ క్షత్రీయ సమాజ్ రాష్ట్ర అధ్యక్షుడు ఉమేష్ జయగ్ని, సంఘ సేవకుడు గోపాల్ బల్దావ, శీతల్ నీమ్‌కర్, కవితా బాసుత్కర్, జ్యోతి, కమల్ గడాలే పాల్గొన్నారు.


సమాజ్ ప్రతినిధులను సన్మానిస్తున్న అధ్యక్షుడు ప్రశాంత్ నీమ్‌కర్

విద్యార్థులు దురలవాట్లకు దూరంగా ఉండాలి


మాట్లాడుతున్న రమణరాజు

గోల్కొండ: విద్యార్థులు దురలవాట్లకు దూరంగా ఉండాలని గోల్కొండ డిప్యూటీ ఈఓ రమణరాజు అన్నారు. సోమవారం కుల్సుంపుర ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రజానాట్య మండలి హైదరాబాద్ నగర కమిటీ ఆధ్వర్యంలో డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంపై ఫొటో ఎగ్జిబిషన్ జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. డ్రగ్స్‌తో పాటు ఇతర మత్తుపదార్థాల వాడకంపై ప్రతి విద్యార్థి దానికి వ్యతిరేకంగా జరుగుతున్న కార్యక్రమాలకు అంబాసిటర్‌గా వ్యవహరించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తపాచబుత్ర ఇన్‌స్పెక్టర్ రాములు, ప్రజానాట్య మండలికి చెందిన ఏ.మారన్న, కల్యాణ్, శశికళ, లావణ్య, ఏడు మేకల శ్రీశైలం పాల్గొన్నారు.

లాల్‌దర్వాజా అమ్మవారికి మగ్గంపై చీర తయారీ ప్రారంభం



చాంద్రాయణగుట్ట: బోనాల ఉత్సవాలలో భాగంగా లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి అమ్మవారికి గాంధీనగర్ కార్పొరేటర్ పావనీ వినయ్ కుమార్ చేనేత మగ్గంపై పట్టుచీరను నేయిస్తున్నారు. ఇందుకు సంబంధించి ఆలయంలోనే మగ్గం పెట్టి చీర తయారీ ప్రక్రియను ఆలయ చైర్మన్ రాజేందర్ సోమవారం ప్రారంభించారు. శుక్రవారం ఉదయం 10.30 గంటలకు చీరను అమ్మవారికి కార్పొరేటర్ చేతుల మీదుగా అందజేయనున్నట్లు కుటుంబ సభ్యులు అనీల్‌కుమార్, రామానుజం తెలిపారు.

కల్యాణం.. కమనీయం


కల్యాణంలో పాల్గొన్న ఆలయ చైర్మన్ సచిన్ తదితరులు

విజయనగర్‌కాలనీ: మాసబ్‌ట్యాంక్ ఎన్ఎండీసీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీనివాసుని కల్యాణం వైభవంగా జరిగింది. కల్యాణాన్ని వీక్షించడానికి ఆసిఫ్‌నగర్, మెహిదీపట్నం, హుమాయూన్‌నగర్, మురాద్‌నగర్, విజయనగర్‌కాలనీ, శాంతినగర్ తదితర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ సచిన్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు వెంకటేష్, ఆలయ కమిటీ సభ్యులు డి.నాగరాజ్, ఏవి.సురేందర్, వనజ, సురేష్, వెంకట్రమణ, రవి, అమర్నాథ్, అమరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

బీసీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

చార్మినార్: కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో భాగంగా ఎన్నికలలో బీసీలకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం బహదూర్‌పురా తహసీల్దార్ చంద్రశేఖర్‌కు వినతి పత్రం అందజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన ఆరు నెలల లోపు కుల గణన చేసి బీసీ కమిషన్ నివేదిక ఆధారంగా బీసీలందరికీ రిజర్వేషన్లు పెంచుతామన్నారన్నారు. స్థానిక సంస్థల్లో ప్రస్తుతం ఉన్న బీసీ రిజర్వేషన్లను 23 శాతం నుంచి 42 శాతానికి పెంచుతామని హామీ ఇచ్చి ఇప్పటి వరకు అమలు చేయలేదన్నారు. బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఐటీ సెల్ కన్వీనర్ ప్యారసాని వెంకటేష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లెల లక్ష్మణ్, మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు ప్రకాష్ గౌడ్, కరణ్, కార్యదర్శి గౌరీ శంకర్, సుధీర్ కుమార్ పాల్గొన్నారు.


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ ఓబీసీ మోర్చా నాయకులు

'కమిటీతో సంబంధం లేనివారికి చందాలు ఇవ్వొద్దు'

చాంద్రాయణగుట్ట: లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి అమ్మవారి ఆలయం పేరున కొందరు నకిలీ చందా బుక్‌లు ముద్రించి చందాలు వసూలు చేస్తున్నారని, అలాంటి వారికి భక్తులెవరూ చందాలు ఇవ్వొద్దని కమిటీ చైర్మన్ సి.రాజేందర్ యాదవ్, ప్రధాన కార్యదర్శి బి.మారుతీ యాదవ్, మాజీ చైర్మన్లు జాజుల లక్ష్మీనారాయణ గౌడ్, కె.విష్ణు గౌడ్‌లు విజ్ఞప్తి చేశారు. కొందరు ఆలయ ధర్మకర్తలమంటూ చందాలు వసూలు చేస్తున్న విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. ఎవరైనా చందా ఇవ్వాలనుకుంటే ఆలయానికి వచ్చి హుండీలో వేయడం గాని, లేనియెడల కమిటీకి అందజేసి రసీదును పొందాలని కోరారు.

తాళ్లపెల్లి రాజేష్‌కు డాక్టరేట్



గోల్కొండ: జి.నారాయణమ్మ మహిళా ఇంజినీరింగ్ కళాశాల బీఎస్సీఈ అసిస్టెంట్ ప్రొఫెసర్ తాళ్లపెల్లి రాజేష్‌కు జేఎన్‌టీయూ వారు డాక్టరేట్ ప్రకటించారు. జేఎన్‌టీయూ పరీక్షల విభాగం సంచాలకులు డాక్టర్ ఏ.అరుణ కుమారి ఈ మేరకు తాళ్లపెల్లి రాజేష్‌కు డాక్టరేట్ ప్రదానం చేస్తున్నట్లు ఉత్తర్వులు పంపారు. చైతన్య భారతీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ విద్యార్థి అయిన రాజేష్ జీఎస్‌ఐటీఎస్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. హైబ్రీడ్ క్లస్టరింగ్ అప్రొచ్‌ఫర్ టైమ్ స్పిరిట్ డాటా అనే అంశంపై ప్రొఫెసర్ వేణుగోపాల్ పర్యవేక్షణలో పరిశోధన చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రమేష్‌రెడ్డి, డాక్టర్ ఎం.సీత, డాక్టర్ ఏ.శారదా తదితరులు సోమవారం కళాశాలలో ఆయనను అభినందించి సన్మానించారు.

'బోనాలను ఘనంగా నిర్వహిస్తాం'


వర్కల శ్రీహరి

చాంద్రాయణగుట్ట: అశోక్‌నగర్‌లోని సప్త మాతృక ఆలయంలో ఈ ఏడాది 19వ బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ వర్కల శ్రీహరి తెలిపారు. సోమవారం ఆయన బోనాల ఉత్సవాల వివరాలు వెల్లడించారు. ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దామన్నారు. 28న జరిగే బోనాల ఉత్సవాల్లో ఉదయం నుంచే అమ్మవారికి బోనాల సమర్పణ ఉంటుందన్నారు. సాయంత్రం ఫలహారపు బండి ఊరేగింపు కొనసాగుతుందన్నారు. 29న తొట్టెల ఊరేగింపు ఉంటుందన్నారు. వైస్ చైర్మన్ వి.సత్యనారాయణ, అధ్యక్షుడు గణేష్, కోశాధికారి జ్ఞానేశ్వర్, సభ్యులు వి.నాగరాజు, టింకు, బాబు, శ్రీధర్, భానుల సమన్వయంతో బోనాలు ఘనంగా నిర్వహిస్తామన్నారు.

విద్యుత్ వినియోగదారులు జాగ్రత్తలు తీసుకోవాలి


వెంకటేశ్ గౌడ్

శాలిబండ: వర్షాకాలం నేపథ్యంలో విద్యుత్ ప్రమాదానికి గురి కాకుండా వినియోగదారులు, విద్యార్థులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని టీజీఎస్‌పీడీసీఎల్ మీరాలం సబ్ డివిజన్ ఆపరేషన్స్ ఏడీఈ కె.వెంకటేశ్ గౌడ్ సూచించారు. తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ..గాలి, దుమారం వచ్చినా, గాలితో కూడిన వర్షం వచ్చినప్పుడు విద్యుత్ తీగల కింద, ఐరన్ పోల్‌కు దగ్గరగా ఉండొద్దన్నారు. ఏదైనా లైన్‌లో ఎలాంటి సమస్యా మీ దృష్టికి వస్తే మాకు తక్షణమే సమాచారం అందించాలన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ దగ్గర ఎట్టి పరిస్థితుల్లో చెత్తాచెదారాలు వేయకూడదన్నారు. టాయిలెట్స్ చేయరాదన్నారు. సెల్‌ఫోన్స్ కూడా చార్జింగ్ పెట్టి మాట్లాడకూదన్నారు. అపార్ట్‌మెంట్, ఇంటికి సరైన ఎర్తింగ్ తప్పనిసరిగా ఉండాలన్నారు. ఎవరైనా ముఖ్యంగా చిన్న పిల్లలు, విద్యార్థులు విద్యుత్ పరికరాలకు దగ్గర నిర్లక్ష్యంగా ఉంటే ప్రమాదాలకు దారి తీస్తుందన్నారు. ఎలాంటి విద్యుత్ సమస్యలు ఉన్నా మా డిపార్ట్‌మెంట్ ఆయా ఏరియా ఫ్యూజ్ ఆఫ్ కాల్ సెంటర్‌లకు 1912కి గానీ, ఏఈలకు గానీ, ఏడీఈకి గాని కాల్ చేస్తే సమస్య వెంటనే పరిష్కారం అవుతుందన్నారు.

క్రీడారంగ అభివృద్ధికి ప్రణాళికలతో ముందుకెళ్తాం


ఎల్బీస్టేడియాన్ని పరిశీలిస్తున్న స్పోర్ట్స్ చైర్మన్ శివసేనారెడ్డి తదితరులు

గన్‌ఫౌండ్రీ: క్రీడారంగ అభివృద్ధికి ప్రణాళికలతో ముందుకెళ్తామని తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ కే.శివసేనారెడ్డి అన్నారు. ఎల్బీ స్టేడియంలో హైదరాబాద్ జిల్లా క్రీడా, యువజన అభివృద్ధి అధికారులతో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో పదేళ్లుగా క్రీడారంగం కోమాల్లో ఉందని ఎద్దేవ చేశారు. క్రీడల అభివృద్ధికి కార్పొరేట్ సహకారం, సీఎస్ఆర్ నిధులతో వివిధ కార్యక్రమాలు రూపొందించి ప్రణాళికబద్ధంగా ముందుకు వెళ్లాలని అధికారులకు సూచించారు. క్రీడల శిక్షణ కార్యక్రమాలలో ఎటువంటి అలసత్వం ప్రదర్శించవద్దని ఆదేశించారు. వివిధ క్రీడా ప్రముఖులు, కోచ్‌లతో చర్చించి అవసరమైన విధాన ప్రకటనతో ముందుకు వెళ్దామని అధికారులను కోరారు. పలు జిల్లాలో కోచ్‌లు క్రీడా సిబ్బంది కొరత ఉందని అధికారులు తెలపగా ఆయా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీనిచ్చారు. అనంతరం ఎల్బీస్టేడియం, ఇండోర్ స్టేడియాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో శాసన సభ్యులు బీర్ల ఐలయ్య, స్పోర్ట్స్ అథారిటీ ఎండీ కె.సోని బాలదేవి, డిప్యూటీ డైరెక్టర్లు అనురాధ, సూర్యలత, చంద్రారెడ్డి, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నూతన కమిటీ ఎన్నిక



దూద్‌బౌలి: బోనాలను పురస్కరించుకొని చిన్న బజార్ గజ్జల పాపమ్మ ఆలయ నూతన కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. కార్పొరేటర్ సున్నం రాజమోహన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో చైర్మన్‌గా గున్నాల విశాల్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులుగా సున్నం శ్రీకాంత్, బాక్సర్ రాజు, పుప్పాల కపిల్, దిడ్డి సంతోష్, పుప్పాల అశ్విన్‌ను నియమించారు. కార్పొరేటర్ రాజమోహన్ మాట్లాడుతూ.. ఆనవాయితీ ప్రకారం చిన్న బజారులో 27న బోనాలు నిర్వహిస్తామని ఆయన తెలిపారు. అనంతరం మాజీ చైర్మన్ బాక్సర్ రాజు, అభిషేక్ రాజ్‌ను వారు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ సభ్యులు పవన్ పండిత్, సునీల్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా జర్నలిస్టు ప్రీమియర్ లీగ్


మ్యాచ్‌ను ప్రారంభిస్తున్న భరత్‌రెడ్డి తదితరులు

గన్‌ఫౌండ్రీ: కేఎస్‌జీ జర్నలిస్టు టీ–20 ప్రీమియర్ లీగ్ ఘనంగా ప్రారంభమైంది. సోమవారం విజయానంద్ మైదానంలో జరిగిన తొలి మ్యాచ్‌ను తృక్ష ఫుడ్స్ ఎండీ భరత్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నిత్యం ఉరుకులు పరుగులు తీసే జర్నలిస్టులకు ఈ క్రీడా పోటీలు కొంత ఉపశమనాన్ని కలిగిస్తాయన్నారు. కాగా తొలి మ్యాచ్‌లో థండర్స్ విజయం సాధించగా 2వ మ్యాచ్‌లో ఎం.రైజర్స్ గెలుపొందింది. ఈనెల 25వ తేదీ వరకు ఈ లీగ్ కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు.

నేడు కట్టమైసమ్మ ఆలయంలో బోనాలు

యాకుత్‌పురా: తెలంగాణ గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎంప్లాయీస్ యూనియన్ (టీఆర్‌ఎస్ కేవీ) ఆధ్వర్యంలో మంగళవారం ట్యాంక్‌బండ్ జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలోని కట్టమైసమ్మ అమ్మవారికి బోనాలు సమర్పించానున్నామని సోమవారం యూనియన్ అధ్యక్షుడు కొమ్మగళ్ల బాలకృష్ణ, ప్రధాన కార్యదర్శి కే.వెంకటేష్ తెలిపారు. ఉదయం 10:30 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టీ విక్రమార్క, మంత్రులు దామోదర రాజనరసింహ, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దానసరి అనసూయ, ఎమ్మెల్యేలు కేటీఆర్, హరీష్‌రావు, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, దానం నాగేందర్, యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు యాదవ్ హాజరుకానున్నారన్నారు.



హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ ఆయురారోగ్యాలతో జీవించాలని కోరుతూ బీబీకా ఆలంకు దట్టీలు, పూలు సమర్పించి ప్రార్థించినట్లు బీజేపీ మాజీ అధికార ప్రతినిధి మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ అన్నారు. ఈ మేరకు దత్తాత్రేయను కలిసి దట్టీ కట్టినట్లు ఆయన తెలిపారు. ఆయనతో పాటు బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యురాలు షబానా మోమిన్, బీజేపీ మైనార్టీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు అల్కా మనోజ్ తదితరులున్నారు.
- చార్మినార్

ఉప్పుగూడ బోనాలకు ఆహ్వానం


ఆహ్వాన పత్రం అందజేస్తున్న జనగామ మధుసూదన్ గౌడ్

చార్మినార్: ఉప్పుగూడలో జరిగే బోనాల ఉత్సవాల్లో పాల్గొనాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు హెచ్.వేణుగోపాల్‌ను కలిసి ఆహ్వానపత్రం అందజేసినట్లు ఉప్పుగూడ మహంకాళి ఆలయ కమిటీ చైర్మన్ జనగామ సూదన్‌గౌడ్ తెలిపారు. ఆయన ఆధ్వర్యంలోని ప్రతినిధుల బృందం సోమవారం వేణుగోపాల్‌ను కలిసి ఆహ్వాన పత్రం అందజేశారు. ఆయనను కలిసిన వారిలో కీర్తి నరేందర్ ముదిరాజ్, సతీష్, ప్రదీప్, ఆనంద్ తదితరులున్నారు.

గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌కు..


గవర్నర్ రాధాకృష్ణన్‌కు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

యాకుత్‌పురా: హరిబౌలీ అక్కన్న మాదన్న మహంకాళి ఆలయంలో ఈ నెల 28న నిర్వహించే బోనాల ఉత్సవాల్లో పాల్గొనాలని కోరుతూ ఆలయ కమిటీ సభ్యులు గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌ను సోమ వారం రాజ్‌భవన్‌లో కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. గవర్నర్‌ను కలిసిన వారిలో ఆలయ కమిటీ అధ్యక్షుడు జగన్మోహన్ పర్షాద్, సలహాదారులు రాజారత్నం, కార్యదర్శి దత్తత్రేయ, కోశాధికారి సతీష్ ఉన్నారు.

ఏసీపీకి..


ఏసీపీకి ఆహ్వాన పత్రికను అందజేస్తున్న కమిటీ ప్రతినిధులు

గౌలిపురా: పటేల్‌నగర్‌లోని రేణుకాఎల్లమ్మ ఆలయంలో నిర్వహించే బోనాల ఉత్సవాలకు హాజరుకావాలని కోరుతూ సోమవారం ఛత్రినాక డివిజన్ ఏసీపీ సీహెచ్.చంద్రశేఖర్‌ను ఆలయ కమిటీ ప్రతినిధులు కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సాకెల్లి సర్వేశ్ కుమార్, కమిటీ ప్రతినిధులు కృష్ణ, శ్రీనివాస్, లింగం, శేఖర్ పాల్గొన్నారు.

ఘనంగా అమ్మవారి ఘటం ఊరేగింపు


ఊరేగింపులో నల్ల పోచమ్మ ఆలయ ఘటం

గౌలిపురా: గౌలిపురా సీబీ క్వార్టర్స్‌లోని నల్ల పోచమ్మ ఆలయంలో బోనాల ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో ఆదివారం సాయంత్రం శాలిబండ కాశీ విశ్వనాథ ఆలయం నుంచి అమ్మవారి ఘటాన్ని ఊరేగింపుగా పోతరాజుల నృత్యాలు, డప్పు చప్పుళ్లతో తీసుకొచ్చి ఆలయంలో ప్రతిష్ఠించారు. సోమవారం సాయంత్రం ఆలయంలో సహస్ర బిల్వార్చన కార్యక్రమాన్ని డొంకి యాదగిరి, పద్మ దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు ఆదర్ల మహేశ్, కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వ్యాస పూర్ణిమ


రాహుల్‌దాస్ బాబాతో భక్తులు

లంగర్‌హౌస్: జానకీ సమేత వీరవెంకట విజయరాఘవ స్వామి ఆలయంలో వ్యాస పూర్ణిమ ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఇందులో భాగంగా పీఠాధిపతి 1008 రాహుల్‌దాస్ బాబా ఆధ్వర్యంలో సుందరకాండ పారాయణం నిర్వహించారు. అనంతరం గతంలో సజీవ సమాధి అయిన పీఠాధిపతులతో పాటు దివంగత బల్బీర్‌దాస్ బాబా యాతిరాజ్ స్వామిలకు గురు పూజ చేశారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాన్ని సైతం లెక్క చేయకుండా నగర నలుమూలల నుంచి తరలివచ్చిన భక్తులు ఆలయంలో రాహుల్‌దాస్ బాబాకు పాదపూజ నిర్వహించారు.

పురాతన చెట్లపై దృష్టి పెట్టాలి


మహమ్మద్ అహ్మద్

చార్మినార్: పురాతన చెట్లపై దృష్టి పెట్టాలని ఖాజీపురాకు చెందిన సామాజిక కార్యకర్త మహమ్మద్ అహ్మద్ డిమాండ్ చేశారు. సోమవారం మధ్యాహ్నం షంషీర్‌గంజ్‌లో వందేళ్ల నాటి పురాతన చెట్టు నేల కొరగడంతో ఒక వ్యక్తి మరణించగా.. మరో ముగ్గురు గాయపడడం దారుణమన్నారు. జీహెచ్‌ఎంసీ, హార్టీకల్చర్, టీజీఎస్‌పీడీసీఎల్ తదితర విభాగాల మధ్య సమన్వయ లోపం కారణంగానే ఇక్కడ ఈ చెట్టు కూలిందన్నారు. గతంలో ఎన్నోసార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదన్నారు. ఈ ఘటనకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

సూర్యనగర్ కాలనీలో సమస్యల తిష్ట

- పేరుకుపోతున్న చెత్తాచెదారం, పొంగిపొర్లుతున్న డ్రైనేజీలు
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు
- పట్టించుకోని అధికారులు


కాలనీలో పేరుకుపోయిన చెత్తాచెదారం


పారుతున్న మురుగు నీరు

గోల్కొండ: షేక్‌పేట్ డివిజన్‌లోని సూర్యనగర్ కాలనీవాసులు సమస్యలతో కుస్తీపడుతున్నారు. టోలిచౌకీ చౌరస్తాకు అత్యంత సమీపంలో పాత ముంబాయి జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న ఈ రహదారి కాలనీలో సుదీర్ఘ కాలంగా సమస్యలు తిష్ట వేసి ఉన్నాయి. అధికారులు గానీ, ప్రజా ప్రతినిధులు గానీ కాలనీ వైపు కన్నెత్తి చూడడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలనీలోని ప్రధాన రహదారులన్నీ అధ్వానంగా మారాయి. ఎటు చూసినా డ్రైనేజీ నీరు పారుతూ దుర్గంధాన్ని వెదజల్లుతోంది. కాలనీలో ఉన్న ఓ ప్రైవేటు పాఠశాల ముందు ఉన్న మ్యాన్‌హోల్ నుంచి మురుగు నీరు ప్రవహిస్తుంది. ఈ కారణంగా పాఠశాల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాలనీలోని ప్రధాన కూడళ్ల వద్ద చెత్తాచెదారం గుట్టలుగా పేరుకుపోతుంది. టోలిచౌకీ చౌరస్తా నుంచి టూమ్స్ రోడ్డు వెళ్లే మెయిన్ రోడ్డుపై సూర్యనగర్ కాలనీ నుంచి ప్రవహించిన మురుగు నీరు చేరి రాకపోకలకు ఇబ్బందులు కలిగిస్తుంది. చెత్త కుప్పలు, మురుగు ప్రవాహం వల్ల దోమలు విజృంభిస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. జలమండలి అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదు. బల్దియా వారికి సైతం ఇస్తున్న ఫిర్యాదులపై సరైన స్పందన రావడం లేదని సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, సకీనా ఫౌండేషన్ చైర్మన్ ఆసీఫ్‌హుస్సేన్ సోహెల్ అంటున్నారు.